



రహదారుల నమూనా

• మెరుగుపడనున్న వైద్యసేవలు



గత బడ్జెట్ కంటే ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్ 23 శాతం పెరిగింది. అందులో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారు. ఆరోగ్య, కుటుంబసంక్షేమ, వైద్య విద్యకోసం రూ.18,421 కోట్లు కేటాయించారు. తద్వారా రాష్ట్రంలో ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడతాయి.

- సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి

• ప్రజల ఆకాంక్షలకు తగ్గ బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. విద్య, వైద్యం, వ్యవసాయం, బీసీలకు పెద్ద పీట వేశారు. వైసీపీ హయాంలో నిర్వీర్యమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు పునర్వైభవం వచ్చేలా బడ్జెట్ ఉంది. పోలీసు వ్యవస్థను పటిష్ఠపరిచేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

-కొల్లకుంట అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

• ప్రజారంజక బడ్జెట్



రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ప్రజారంజక బడ్జెట్. వ్యవసాయం, విద్య, ఆరోగ్యంపై దృష్టి పెడుతూ, పెట్టుబడులు, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌ను రూపొందించారు. అభివృద్ధిని పరుగులు పెట్టించే బడ్జెట్.

- జీఎం శేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

• అద్భుతమైన బడ్జెట్



అద్భుతమైన బడ్జెట్ ఇది. సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పేదలు, రైతులకు మేలు చేకూరనుంది. విద్యాభివృద్ధికి పెద్ద పీట వేయడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి ఊతం ఇచ్చేలా బడ్జెట్ ఉంది.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

• సూపర్‌సిక్స్ అమలుకు అడుగులు



సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌తో అధికంగా కేటాయించారు. బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్దపీట వేశారు. సంక్షేమం, అభివృద్ధికి భారీగా కేటాయించడం హర్షణీయం. బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, వైద్యానికి పెద్దపీట వేయడం సంతోషించదగ్గ విషయం.

-గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

• ఏపీ ప్రగతికి నాంది



అన్నివర్గాలను దృష్టిలో ఉంచుకుని, రూపొందించిన బడ్జెట్. వైసీపీ ఎమ్మెల్యేలకు దిమ్మతిరిగేలా బడ్జెట్ ఉంది. మంత్రి పయ్యావుల కేశవ్ రాజకీయ అనుభవంతో అద్భుతంగా రూపొందించారు.

- పల్లె రఘునాథరెడ్డి, మాజీ మంత్రి

• అన్నివర్గాలకు సమన్యాయం



అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ బడ్జెట్‌ను రూపొందించారు. ఉన్నత విద్యతో పాటు గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, పరిశ్రమలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించిన ఘనత ఎన్డీఏ కూటమికే దక్కింది.

- చిలకం మధుసూదన్‌రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విద్యకు ప్రాధాన్యం అభినందనీయం



విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో ఈసారి అత్యధిక నిధులు కేటాయించడం అభినందనీయం. తద్వారా విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ఈసారి పాఠశాల విద్యకు రూ.29,090 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,326 కోట్లు కేటాయించడం హర్షణీయం.


- ఆంజనేయులు, డీఎస్సీ అభ్యర్థి

• రైతుకు ప్రాధాన్యం



బడ్జెట్ సంతృప్తికరంగా ఉంది. రైతులను ఆదుకునేలా ఉంది. పెట్టుబడి సాయం, వడ్డీలేని రుణాలు, సబ్సిడీ పథకాలతో రైతుకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

-వెంకటేశ్, రైతు, మేడాపురం, చెన్నేకొత్తపల్లిమండలం



బంపర్ బడ్జెట్..!

- జిల్లాకి బడ్జెట్ బూస్ట్
- నీటి ప్రాజెక్టులకు నిధుల వరద
- వ్యవసాయానికి భారీగా కేటాయింపులు
- రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం
- నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం
- ఉపాధి కల్పనకు ఊతం

కరువు జిల్లాకి రాష్ట్ర బడ్జెట్ బూస్టనిచ్చింది. అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడనుంది. జిల్లా అభివృద్ధికి కీలకమైన నీటి పారుదల, రహదారులు, పరిశ్రమల ఏర్పాటు, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, వ్యవసాయం, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి హితోధికంగా నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బడ్జెట్‌తో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఊసేలేకుండా పోయింది. అన్నిరంగాలూ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్.. అన్నిరంగాలకు ప్రాణం పోసింది.

- పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

నిధుల వరద

జిల్లా అభివృద్ధికి ప్రధాన వనరు నీరు. తద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ప్రగతి సాధ్యం. అంతటి కీలకమైన నీటి ప్రాజెక్టులపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయింది. ఉన్నవాటికి కూడా మరమ్మతులు చేయలేక చేతులెత్తేసింది. దీంతో సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే బడ్జెట్‌లో జలవనరుల శాఖకు రూ.16,705 కోట్లు కేటాయించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు రూ.1077 కోట్లు సమకూర్చనుంది. అందులో హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.822 కోట్లు, హెచ్చెల్సీ మరమ్మత్తులకు రూ.30 కోట్లు కేటాయించారు. తద్వారా హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పట్టాలెక్కే అవకాశం ఉంది. అదే జరిగితే జిల్లాకు రెట్టింపు మొత్తంలో సాగునీరు అందనుంది. తద్వారా పంటల సాగు పెరుగుతుంది. పారిశ్రామిక ప్రగతి సైతం పరుగులు పెట్టనుంది.

అభివృద్ధికి బాటలు

జిల్లాలో కియ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో పారిశ్రామిక హబ్‌గా అవతరించింది. మరిన్ని పరిశ్రమలు రావాలంటే రోడ్ల అభివృద్ధి ముఖ్యం. ఇప్పటికే జిల్లాలో పలు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో రోడ్లు, భవనాలకు రూ.9,554 కోట్లు కేటాయించారు. ఈ లెక్కన జిల్లాలో రహదారులకు మహర్దశ పట్టనుంది. రోడ్లు అభివృద్ధి చెందితే.. పారిశ్రామికంగా మరింత ప్రగతి సాధ్యమవుతుంది. జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. శిల్పకళల కాణాచి లేపాక్షి, రాయల రెండో రాజధాని పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రాత్మక సంపద, కళాకృతులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటక రంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించడం జిల్లాకు కలిసొచ్చే అంశం.

సంక్షేమం..

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఏకంగా రూ.69 వేల కోట్లు కేటాయించారు. మహిళా, శిశు సంక్షేమానికి ఏకంగా రూ.4285 కోట్లు ప్రకటించారు. ఈ కేటాయింపులపై ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



పెనుకొండ వద్దగల పారిశ్రామిక వాడ



కియ కార్ల పరిశ్రమ

నైపుణ్యాల పెంపు దిశగా..

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెడుతోంది. యువత ఉద్యోగాలు సాధించేలా వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు బడ్జెట్‌లో శ్రద్ధ చూపారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా 192 శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. అందులో 2 నుంచి 3 కేంద్రాలు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశముంది. ఇది పారిశ్రామికాభివృద్ధిలో వచ్చే ఉద్యోగావకాశాలను జిల్లా యువత దక్కించుకునేందుకు దోహదపడనుంది.

అన్నదాతకు అండ

బడ్జెట్‌లో రైతు సంక్షేమానికి భారీగా కేటాయించారు. అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వడ్డీలేని రుణాలు, మార్కెటింగ్, విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలు, ఎరువుల పంపిణీ, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్, రైతు సేవాకేంద్రాలు, ఉద్యాన, సహకార శాఖల ద్వారా రైతును ఆదుకునేందుకు ఏకంగా బడ్జెట్‌లో రూ.43,402 కోట్లు ప్రకటించారు. కరువు కోరల్లో చిక్కిన జిల్లా రైతాంగానికి ఇది బిగ్ రిలీఫ్.



లేపాక్షి ఏకశిలా నంది విగ్రహం

నిధులున్నా... అందని అద్దెలు..!



- ఐసీడీఎస్ పురం ప్రాజెక్టులో చోద్యం
- అంగన్‌వాడీ భవనాల అద్దె చెల్లింపులో జాప్యం
- నిధులు వచ్చి పక్షం రోజులైనా చెల్లించని దుస్థితి
- వర్గపోరే కారణమన్న విమర్శలు

హిందూపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బడ్జెట్ వచ్చిందంటే వెంటనే బిల్లులు చెల్లించేస్తారు. ఐసీడీఎస్ హిందూపురం ప్రాజెక్టులో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలకు సంబంధించి నిధులు వచ్చి పక్షం రోజులైనా చెల్లింపులు మాత్రం చేయట్లేదు. ప్రాజెక్టులో అధికారుల మధ్య వర్గపోరే ఇందుకు కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను అద్దెకిచ్చిన వారికి ఎదురుచూపులు తప్పట్లేదు. అద్దెల కోసం వారు ఒత్తిడి చేస్తుంటే.. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సొంత డబ్బు చెల్లిస్తున్నారు. నిధులొచ్చినా ఈ దుస్థితి ఏంటని వారు వాపోతున్నారు.

మే నెల నుంచి పెండింగ్

హిందూపురం పట్టణ పరిధిలో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం భవనానికి రూ.6 వేలు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. రూరల్ ప్రాంతాల్లో రూ.2 వేలు ఇస్తున్నారు. హిందూపురం పట్టణంలో 67 అద్దె భవనాలున్నాయి. వీటికి నెలకు అద్దె రూ.4.02 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రూరల్ ప్రాంతాల్లో 117 అద్దె భవనాలున్నాయి. వీటికి నెలకు రూ.2.34 లక్షలు అద్దెల రూపంలో కట్టాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులు ఈ ఏడాది మే నెల నుంచి పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి. నెలలుగా అద్దెలు చెల్లించకపోవడంతో భవనాల యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇకట్రెండు నెలలైతే ఫర్వాలేదు కానీ, ఇన్ని నెలలు అంటే కుదరదని తెగేసి చెబుతున్నారు. కొందరైతే తాళాలు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో చేసేది లేక అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వేతనాలు నుంచి, అప్పులు తెచ్చి అద్దెలు చెల్లించిన సందర్భాలున్నాయని కార్యకర్తలు వాపోతున్నారు.



మేళాపురంలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

వారి వద్దే ఉంచుకోవడం సరికాదు



అంగన్‌వాడీ కార్యకర్తలకు వచ్చేది అరకొరత జీతం. దాంతోనే ఇంటిని అతి కష్టమ్మీద నెట్టుకొస్తున్నాం. కొందరు వేతనాల నుంచి అంగన్‌వాడీ కేంద్రం భవనాల అద్దెలు చెల్లించారు. ఇంకొందరు అప్పులు చేసి, కట్టారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నిధులు వచ్చి నెల కావస్తున్నా చెల్లించకుండా వారి వద్దే ఉంచుకోవడం సరికాదు. వెంటనే చెల్లించి, ఆదుకోవాలి.

- లావణ్య, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి

కారణాలేంటో..?

ప్రాజెక్టులో నిధులున్నా చెల్లింపులు చేయకపోవడానికి కారణమేంటోనన్న చర్చలు సాగుతున్నాయి. ఓ ఉన్నతాధికారికి బిల్లుల చెల్లింపుపై అవగాహన లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అక్కడ పనిచేసే సిబ్బందికి కూడా తెలియదని ఆ శాఖలో చర్చ సాగుతోంది. ఇదివరకు అక్కడ పనిచేసే అధికారులు.. బిల్లులు చేయడంలో సహకరించేవారని తెలుస్తోంది. ఉన్నతాధికారితో వారికి విభేదాలు తలెత్తడంతో తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. దీంతో బిల్లుల చెల్లింపు ముందుకు కదలట్లేదని ప్రాజెక్టు వర్గాలు పేర్కొంటున్నాయి. బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దె బిల్లులు చెల్లించకపోతే ఆందోళన చేపడతాం

- అంగన్‌వాడీల హెచ్చరిక

అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లులు చెల్లించకపోతే ఆందోళన చేపడతామని హిందూపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు హెచ్చరించారు. సోమవారం పూలకుంట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు వెళ్లి అంగన్‌వాడీ బ్లాక్ కో-ఆర్డినేటర్ వరుణ్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో కుటుంబం నెట్టుకొస్తున్నామనీ, ఇలాంటి తరుణంలో 8 నెలల అద్దెలు పెండింగ్ పెడితే ఎలా బతకాలని నిలదీశారు. అప్పులు చేసి అద్దెలు కడుతున్నామని వాపోయారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బిల్లుల నిధులు వచ్చి నెల రోజులవుతున్నా వాటిని తమ అకౌంట్లలోకి జమ చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. మిగతా ప్రాజెక్టుల్లో అద్దె బిల్లుల జమ చేశారనీ, ఇక్కడ మాత్రమే పెండింగ్ పెట్టారని మండిపడ్డారు. ఇంకా బిల్లుల చెల్లింపుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మూడు రోజుల్లో కార్యకర్తల ఖాతాల్లోకి అద్దెల నిధులు జమకాకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



బ్లాక్ కోఆర్డినేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

అంగన్‌వాడీల అద్దె భవనాల బడ్జెట్ వచ్చి 15 రోజులైంది. అద్దెలు చెల్లించే పనిలోనే ఉన్నాం. త్వరలో చెల్లిస్తాం. కాస్త ఆలస్యమైన విషయం వాస్తవమే.

- రెడ్డి రమణమ్మ, సీడీపీఓ, హిందూపురం ప్రాజెక్టు

వారంలో నాలుగు రోజులు గ్రామసభలు

కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వారంలో నాలుగు రోజులు గ్రామసభలు నిర్వహించి, భూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై బాధితుల నుంచి 253 ఫిర్యాదులు అందాయి. వాటిని కలెక్టర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... వారంలో నాలుగు రోజులు గ్రామసభలు నిర్వహించి, భూసమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజాఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులపై వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ, సీపీఓ విజయ్‌కుమార్, డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదిదారుల వద్దకే ఎస్పీ

పుట్టపర్తిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీపీఓలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన అర్జీదారుల వద్దకే ఎస్పీ రత్న వెళ్లి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 50 ఫిర్యాదులు అందాయి. మహిళలు, దివ్యాంగులు, వృద్ధుల వద్దకే ఎస్పీ వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళల వద్దకే వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న



సాగునీటి ప్రాజెక్టులకు రూ.1077 కోట్లు

వ్యవసాయ పథకాలకు భారీగా కేటాయింపులు

నైపుణ్య శిక్షణకు ప్రత్యేక కేంద్రాలు

బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట

ఉమ్మడి జిల్లా రుణం తీర్చుకునేలా బడ్జెట్



సంక్షేమ బడ్జెట్..

రైతు, పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన బడ్జెట్ ఇది. ప్రజలు మెచ్చుకునేలా ఉంది. వైసీపీ ప్రభుత్వ బడ్జెట్‌లు రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీశాయి. కొన్నేళ్లు వెనక్కు నెట్టాయి. కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ధన్యవాదాలు.

- బండారు శ్రావణి, ఎమ్మెల్యే, శింగనమల

కరువు జిల్లాపై కరుణ

చంద్రన్న అభిమానం..

ఐదేళ్ల వైసీపీ పాలనలో కరువు జిల్లా ప్రజానీకం, రైతాంగం ఎదుర్కొన్న సమస్యలను, ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన వైనాన్ని చంద్రబాబు ప్రత్యక్షంగా చూశారు. ఇక్కడి రైతాంగం ఎదుర్కొంటున్న బాధల నుంచి విముక్తి కలిగించాలన్నదే చంద్రబాబు తపన. ప్రాజెక్టులను పూర్తి చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలనే సంకల్పం ఆయనది. ఎప్పుడు జిల్లాకొచ్చినా అనంత అంటే తనకెంతో అభిమానమని చెబుతుంటారు. ఆ అభిమానాన్ని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి చాటుకున్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులున్నాయి.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే



అనంతపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత కరువు కోరల నుంచి శాశ్వతంగా బయటపడాలంటే సాగునీరు కావాలి. ప్రతి ఎకరం తడిస్తేగానీ ఈ జిల్లా రైతాంగం సంక్షోభం నుంచి గట్టెక్కే అవకాశం లేదు. వర్షపాతంలో అసమానతల కారణంగా ఖరీఫ్, రబీ.. రెండు సీజన్‌లలోనూ పంటలు దెబ్బతింటున్నాయి. వర్షాలు లేని సమయంలో భూగర్భ జలాలను వాడుకుందామంటే.. పాతాళం వరకూ బోర్లు తవ్వించాలి. అయినా తడి కనిపించదు. ప్రాజెక్టులు పూర్తయితే.. భారీ వర్షాలు, వరదల సమయంలో వచ్చే నీటిని ఒడిసి పట్టుకోవచ్చు. ఇదే సమస్యలన్నింటికీ పరిష్కారం. కానీ సాగునీటి విషయంలో దశాబ్దాలుగా జిల్లాకు అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా పరిస్థితిలో మార్పు రాలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి అనంతపై చిన్నచూపు చూశారు. ఈ జిల్లా మనవడిని అంటూ హామీల వరద పారించిన జగన్.. నిధులను మాత్రం ఇవ్వలేదు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు విస్తరించేందుకు సమాంతర కాలువను తవ్విస్తానని లెస్స పలికిన జగన్.. పాలన ముగిసే సమయానికి ప్రాజెక్టు నిర్వహణకు సరిపడా నిధులను కూడా బడ్జెట్‌లో కేటాయించలేదు. హెచ్చెల్సీ ఆధునికీకరణ అటుంచితే.. మరమ్మతులకూ నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో సాగునీటికి ప్రాధాన్యం ఇవ్వడంతో సమస్య కొంతైనా తీరుతుందని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. వీటికి కొనసాగింగా.. రానున్న బడ్జెట్‌లలోనూ నీటికి నిధులను పారించాలి.

లోకేశ్ చొరవ..



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం ఉమ్మడి జిల్లాలో 200 కి.మీ.పైగా యువగళం పాదయాత్ర చేశారు. జిల్లా సరిహద్దు దాటాక.. 2023 ఏప్రిల్ 14న ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి బహిరంగ లేఖ రాశారు. అధికారంలోకి రాగానే అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులకు నిధులిస్తామని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భైరవానితిప్ప, పేరూరు ప్రాజెక్టులకు కృష్ణా జలాల తరలింపు పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. లోకేశ్ హామీలన్నీ నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో నిధులను కేటాయించారు.

చంద్రన్న కరుణ

నీరుంటే బంగారం పండిస్తారు ఉమ్మడి జిల్లా రైతులు. ఆ నీటిని ఇచ్చే దిశగా బడ్జెట్‌లో నిధులు ఇచ్చారు. జలవనరుల శాఖకు మొత్తం రూ.16,705 కోట్లు కేటాయించగా, అందులో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు రూ.1077 కోట్లు కేటాయించింది. హంద్రీనీవాకు రూ.822 కోట్లు, పేరూరు ప్రాజెక్టుకు రూ.120 కోట్లు, భైరవానితిప్పకు రూ.100 కోట్లు కేటాయించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ ప్రస్తావన లేకపోయినా, మరమ్మతుల కోసం రూ.30 కోట్లు కేటాయించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్లు కూడా ప్రాజెక్టులకు ఇవ్వలేదు.

అన్ని వర్గాలకూ మేలు

- బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేశారు. పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పరిశ్రమలు, వాణిజ్యం, రహదారులు, పర్యావరణం, పర్యాటకం, సాంస్కృతిక, అటవీ, యువజనుల అభివృద్ధికి భారీస్థాయిలో నిధులు కేటాయించారు. ఒక్క పట్టణాభివృద్ధికే రూ.16,705 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. గృహ నిర్మాణానికి రూ.4 వేల కోట్లకుపైబడి నిధులు కేటాయించారు. రోడ్లు, భవనాలకు రూ.9,554 కోట్లు కేటాయించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా నిధులు కేటాయించారు. పోలీసు శాఖకూ గణనీయంగా నిధులు ఇచ్చారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి రూ.69 వేల కోట్లు కేటాయించారు. మహిళా, శిశు సంక్షేమానికి రూ.4,285 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు, ఉన్నత విద్యకు ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనే సంకేతాలను బడ్జెట్ కేటాయింపుల ద్వారా పంపారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు రాష్ట్రంలో ప్రత్యేకంగా 192 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో ఉమ్మడి జిల్లాకు రెండు మూడు వచ్చే అవకాశం ఉంది.
- రైతు శ్రేయస్సు దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఉమ్మడి జిల్లా రైతాంగానికి వ్యవసాయ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వడ్డీలేని రుణాలు, మార్కెటింగ్, విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలు, ఎరువుల పంపిణీ, ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్, రైతు సేవా కేంద్రాలు, ఉద్యాన, సహకార శాఖల ద్వారా రైతును ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.43,402 కోట్లను కేటాయించారు.

ప్రగతికి నాంది...



అన్నివర్గాల సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను రూపొందించారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే అత్యుత్తమ బడ్జెట్ ఇది. వైసీపీ పాలనలో ఉమ్మడి జిల్లాను విస్మరించారు. ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే సాగునీటి ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచే శిక్షణా సంస్థల ఏర్పాటుకు నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపారు.

- బీవీ వెంకటరాముడు, టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్

నిధుల వరద పారించారు...



కూటమి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఉమ్మడి జిల్లాకు నిధుల వరద పారించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమష్టి కృషితో ఈ భారీ బడ్జెట్ పురుడుపోసుకుంది. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్‌ను రూపొందించారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించి.. ప్రజల్లో నమ్మకాన్ని రెట్టింపు చేసుకున్నారు. భవిష్యత్తులో జిల్లాకు మరిన్ని నిధులు వస్తాయి.

- టీసీ వరుణ్, అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు

పునర్వ్యవస్థీకరణ బడ్జెట్..



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ, పునర్వ్యవస్థీకరణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి ఐదు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది. పూర్వవైభవం తెచ్చేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఏకంగా రూ.2,94,427.25 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇందుకు నిదర్శనం. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసేలా నిధులు కేటాయించారు. మానవ వనరుల అభివృద్ధి, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల పురోభివృద్ధి కొనసాగుతుంది. ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి కేశవ్‌కు అభినందనలు.

- సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సంతృప్తికర బడ్జెట్..



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరినీ సంతృప్తి పరిచింది. అన్ని వర్గాలకూ మేలు చేసేలా నిధులు ఇచ్చారు. రైతాంగం, పరిశ్రమలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు అభినందనలు.

- భవానీ రవికుమార్, జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

స్పష్టత లేదు..



జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం రూ.7 వేల కోట్లు కేటాయించే విషయంలో స్పష్టత లేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఇది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. బడ్జెట్‌లో ఆత్మస్తుతి, పరనిందతోనే సరిపెట్టారు. పూర్తి రాజకీయ పత్రంగానే ఉంది. ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనార్టీ సంక్షేమానికి నిధులు నామమాత్రంగానే కేటాయించారు. జనాభాలో సగభాగమైన మహిళాశిశు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు ఎప్పటి నుంచి ఉంటుందో స్పష్టత ఇవ్వలేదు. ఇది ఆయా వర్గాలను నిరాశకు గురిచేస్తోంది. బడ్జెట్‌లో సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని విస్మరించింది.

- రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి, అనంతపురం

నిధులు అరకొరే...



జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. అరకొర నిధులతోనే సరిపెట్టారు. హంద్రీనీవాకు రూ.2 వేల కోట్లు కేటాయించి ఉంటే బాగుండేది. హెచ్చెల్సీ ఆధునికీకరణకు నిధులు విడుదల చేయలేదు. కేవలం మరమ్మతుల కోసం కేటాయించారు. అమ్మకు వందనం, ఉచిత బస్సు, అన్నదాతా సుఖీభవ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. గత ప్రభుత్వం వైఫల్యాలను ప్రస్తావించడంలో చూపిన శ్రద్ధ కరువు జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడంపై చూపలేదు.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి



రైతాంగానికి నిరాశ...

రాష్ట్ర బడ్జెట్ రైతాంగాన్ని నిరాశపరిచింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చింది. రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ప్రకటించింది. బడ్జెట్‌లో రూ.14వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించడం దుర్మార్గం. రాయలసీమలో పంటల పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వమే రూ.20వేలు ఇవ్వాలి. అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్ చేస్తామని చెప్పడం తప్ప బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించలేదు. విత్తనాల సబ్సిడీకి తక్కువ మొత్తంలో నిధులు కేటాయించారు. హెచ్చెల్సీ లైనింగ్, హంద్రీనీవా కాలువ వెడల్పునకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వలేదు.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రగతి.. పునర్నిర్మాణం

బడ్జెట్‌పై మేధావివర్గాల హర్షం

అనంతపురం సెంట్రల్, నవబంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతి, పునర్నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని మేధావి వర్గాలు వ్యాఖ్యానించాయి. మానవ వనరుల అభివృద్ధి, యువత నైపుణ్యాల పెంపుదల, ఉన్నత విద్యావ్యవస్థ బలోపేతానికి పెద్ద పీట వేసిందని హర్షం వ్యక్తం చేశాయి. భారీ పరిశ్రమలను ఆకర్షించేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని పలువురు అన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పట్ల ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ రంగాల ప్రముఖుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

• ప్రణాళికాబద్ధంగా ఉంది..



ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యనందించి, విజ్ఞానం, నైపుణ్యం పెంచేలా ప్రణాళికాబద్ధమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ ముందుచూపునకు నిదర్శనం. వర్సిటీల బలోపేతానికి, జాతీయ సంస్థాగత స్థాయి చట్రం(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు సాధించేందుకు, పోస్టులను భర్తీచేయడానికి చొరవ తీసుకోవడం అభినందనీయం. సేల్స్‌ఫోర్స్ ఎడ్యుస్కిల్స్ మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం, మధ్య వేతనం అందించేలా అప్రెంటిస్‌షిప్‌తోకూడిన డిగ్రీ విద్యను అందించేలా బడ్జెట్ కేటాయింపులు ఉండటాన్ని స్వాగతిస్తున్నాం.

- ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

• స్వర్ణాంధ్ర విజన్..



స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు నడుంబిగించిన కూటమి ప్రభుత్వం, ఆ దిశగా బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. ప్రతి కుటుంబం ఆర్థిక భారం నుంచి గట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలుకు పెద్ద పీట వేసింది. పాఠశాల స్థాయినుంచి ఉన్నత విద్యవరకు బోధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అధ్యాపకుల నైపుణ్యం పెంచే ప్రతిపాదనలు హర్షణీయం. ఉన్నత విద్యారంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

- ప్రొఫెసర్ నారాయణరెడ్డి, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్

• వర్సిటీల బలోపేతం..



సంప్రదాయబద్ధమైన రాష్ట్ర విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం అడుగులు వేయడం హర్షణీయం. ఖాళీ పోస్టుల భర్తీ, విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, నైపుణ్యం రంగంలో వనరుల బలోపేతం, పరిశ్రమలతో అనుసంధానం ఇలా అనేక అంశాలు బడ్జెట్‌లో ఉన్నాయి. ఇవన్నీ వర్సిటీలకు పూర్వవైభాన్ని తెస్తాయి.

- డాక్టర్ రమేష్‌బాబు, ఎస్కేయూ రిజిస్ట్రార్

•న్యాయవిద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సింది..



రాష్ట్ర ప్రగతి, పునర్నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. మానవ వనరుల అభివృద్ధి, యువత నైపుణ్యాల పెంపుదల, ఉన్నత విద్యావ్యవస్థ బలోపేతానికి పెద్ద పీట వేసింది. అయితే న్యాయ వ్యవస్థకు పునాదుల్లాంటి న్యాయ విద్యార్థులకు శిక్షణ, భృతి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో న్యాయ విద్య కోర్సులను ప్రవేశపెట్టి, సరిపడా అధ్యాపకులను నియమించేందుకు కృషిచేయాలి. లేదంటే ప్రైవేట్ లా కాలేజీలపైనే పేద విద్యార్థులు ఆధారపడాల్సి వస్తుంది.

- లాయర్ నారాయణప్ప, బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

• ఉచిత విద్యుత్‌పై స్పష్టత లేదు..



చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు స్పష్టమైన హామీనిచ్చాయి. బడ్జెట్‌లో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉచితం లేదా రాయితీ అని పేర్కొనడం చేనేతలకు నిరాశ కలిగిస్తోంది. అన్ని రంగాల అభివృద్ధికి చూపుతున్నట్లుగానే చేనేత రంగంపై చొరవ చూపాలి. రాయలసీమలో మగ్గంపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కుటుంబాలు చాలా ఉన్నాయి. వారి కళాప్రతిభతో రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటుతున్నారు. వచ్చే బడ్జెట్‌లోనైనా చేనేతలకు తగిన నిధులు కేటాయించాలి.

- రుషింగప్ప, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

• శుభపరిణామం..



ఉన్నత విద్యాశాఖను బలోపేతం చేసేలా బడ్జెట్‌లో రూ.2,326 కోట్లను కేటాయించడం శుభపరిణామం. వర్సిటీల పురోగతిపై మరింత దృష్టి సారించాల్సి ఉంది. మౌలిక సదుపాయాల కల్పన, ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, రీసర్చ్, ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. అప్పుడే మానవ వనరుల అభివృద్ధి సాధ్యమౌతుంది. ప్రవేశాల ప్రక్రియను డిజిటలైజేషన్ చేసేలా వర్సిటీలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయాలి. దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

- అరుణ్ కుమార్, పరిశోధక విద్యార్థి, ఎస్కేయూ

• లక్షల మందికి ఉపాధి...



విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించి లక్షలాది మంది విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 192 నైపుణ్య కేంద్రాలు, నైపుణ్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చొరవచూపారు. నైపుణ్యాభివృద్ధి శాఖకు రూ.1215 కోట్లను కేటాయించడం హర్షణీయం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగంచేసుకోవాలి.

- వెంకటరెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా అధికారి

• వందశాతం ఖర్చుచేయాలి..



ఎస్సీలకు రూ.18,497 కోట్లు, ఎస్టీలకు రూ.7,557 కోట్లు, బీసీలకు రూ.39,007 కోట్లు, మైనార్టీలకు రూ.4,376 కోట్ల నిధులను కాంపొనెంట్ పేరుతో బడ్జెట్‌లో కేటాయించడం అభినందనీయం. ఆ నిధులను వందశాతం ఖర్చు చేయాలి. గత ఐదేళ్లుగా కార్పొరేషన్‌లు నిర్వీర్యం అయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల ప్రజలు ఆర్థికంగా వెనకబడిపోయారు. అర్హత, నైపుణం ఉన్నా ప్రభుత్వ సహకారం లేకపోవడంతో నిరుపేదలుగానే మిగిలిపోయారు.

- సాకే హరి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

సుక్కేద్దామంటే సిక్కలేదే..?



చెట్టు మీద మద్యం బాటిల్‌తో కుస్తీ పడుతున్న వానరం

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తేరగా సిక్కింది కదా ఓ సుక్కేద్దామనుకుందేమో..! గబుక్కున బండి బ్యాగులోని క్వార్టర్ బాటిల్ తీసుకుని చెట్టెక్కింది. దాని మూత తీసే టెక్నిక్ తెలియక చాలా సేపు కష్టపడింది. ఎంతసేపటికీ మూత రాకపోవడంతో... ఎందుకులే అని కిందకు విసిరేసింది. ఇవీ శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మద్యం బాటిల్ మర్కట చేష్టలు. తహసీల్దార్ కార్యాలయంలో పని మీద ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో వచ్చాడు. అతడు కార్యాలయంలోని వెళ్లగానే అక్కడే ఉన్న ఓ వానరం తినడానిక ఏమైనా దొరుకుతాయేమోనని ద్విచక్రవాహనం వద్దకు వచ్చింది. బైక్ బ్యాగులో మద్యం బాటిల్ ఉండటంతో ఏదో తాగేదనుకుని దాన్ని తీసుకుని చెట్టు మీదికి వెళ్లింది. అరగంటపాటు అవస్థలు పడిన బాటిల్ మూత రాకపోవడంతో దాన్ని కిందకు జారవిడిచి, ఉసూరుమంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

ప్రమథనాథా...! పాహిమాం

శైవాలయాలకు కార్తీకశోభ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాశీవిశ్వేశ్వరస్వామి





కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలన్నీ కార్తీకశోభతో దేదీప్యమానంగా వెలుగొందాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు హర నామ స్మరణ చేస్తూ దేవాలయాల్లో దీపాలు వెలిగించి నీలకంఠుడిని ఆరాధించారు. జిల్లాకేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, బెంగళూరు రోడ్డులోని శివ కోటి దేవాలయం, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, జడ్పీ ఎదురుగా ఉన్న గీతామందిరం, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయం, ఆరోరోడ్డు శివాలయం, అరవిందనగర్ సర్వేశ్వరాలయం, హౌసింగ్ బోర్డు శివాలయం తదితర ప్రాంతాల్లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.



వచ్చే నెలే డెడ్‌లైన్

డిసెంబరుకు ఎన్‌హెచ్ పనులు పూర్తి కావాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న జాతీయరహదారుల పనులు డిసెంబరు నెలాఖరులోగా పూర్తి కావాలని సంబంధిత అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. రోడ్డు పనుల ప్రగతిపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్-544డి, ఎన్‌హెచ్-67, ఎన్‌హెచ్ -544డీడీ, ఎన్‌హెచ్-150ఏ జాతీయరహదారులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. ఎట్టిపరిస్థితులలోను డిసెంబరుకు పనులు పూర్తి కావాలన్నారు. జాతీయ రహదారులతో పాటు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, పవర్‌గ్రిడ్‌టవర్స్, ఏపీట్రాన్స్‌కో, జెన్కో, ఏపీ సోలార్ కార్పొరేషన్, రైల్వేస్ తదితర ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఎక్కడెక్కడ ఎంత భూసేకరణ చేపట్టారో వాటి నివేదికలను ఇచ్చి, మిగిలిన భూసేకరణ కొనసాగించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తనతో పాటు జేసీ, డీఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల, ఎన్‌హెచ్ అధికారులు, పవర్‌గ్రిడ్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



జాతీయ రహదారుల పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

డీఎస్పీ కార్యాలయం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలంటూ ఓ మహిళ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన డీఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... పట్టణానికి చెందిన ఓ మహిళను కంబదూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు కొన్ని నెలల కిందట వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలోనే ఆమె గర్భం దాల్చింది. అయితే ఆ ఉపాధ్యాయుడు అబార్షన్ చేయించి, తనను దూరం పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడంటూ ఆ మహిళ కొన్ని రోజుల కిందట ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. పరిశీలించాలని ఎస్పీ కార్యాలయం నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆ ఫిర్యాదును పంపారు. ఈక్రమంలోనే డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆ మహిళ ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా తనకు ఎలాంటి న్యాయం జరగడం లేదని పేర్కొంటూ, తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన పోలీసులు వెంటనే పెట్రోల్ బాటిల్‌ను లాక్కుని ఆమె యత్నాన్ని అడ్డుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తత్కాల్‌లో దళారుల దందా..!

- అనంత రైల్వే స్టేషన్‌లో ఇష్టారాజ్యం
- గంటల తరబడి పడిగాపులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు


ఒక కౌంటరే ఉపయోగంలో ఉన్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం రైల్వే స్టేషన్‌లో తత్కాల్ టికెట్ల జారీలో దళారుల దందాతో అసలైన ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో అర్థం కాని పరిస్థితి. రిజర్వేషన్ కోసం నాలుగు కౌంటర్లు వినియోగించేలా భవనం అందుబాటులో ఉంది. నిర్వహణ మాత్రం అందుకు విరుద్ధంగా అమలవుతోంది. గతంలో ఉన్న పాత రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల వరకు రెండు కౌంటర్లు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం సౌకర్యాలు పెంచారు. ప్రయాణికుల రద్దీ పెరిగినా రిజర్వేషన్ కౌంటర్ మాత్రం ఒక్కటే అందుబాటులో ఉంటోంది. తత్కాల్ సమయంలో కూడా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా యంత్రాంగం చర్యలు చేపట్టలేదు. పేరుకు మాత్రం తత్కాల్ సమయంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమిస్తున్నామని చెప్పుకొస్తున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కనీసం రెండు గంటలు కూడా రెండు కౌంటర్లు తీయలేని దుస్థితి నెలకొంది. రిజర్వేషన్‌కు ఒక్క కౌంటర్ మాత్రమే అందుబాటులో ఉంది. ప్రయాణికులు తత్కాల్ టికెట్ కోసం తమ వరకు వస్తుందో లేదో అని బిక్కు బిక్కుమంటూ లైన్‌లో నిలబడుతున్నారు. లైన్‌లో ఉన్నా ప్రయాణికుల క్యూ మాత్రం ముందుకు కదలడం లేదు. ముందు రోజు రాత్రి నుంచి దళారులు క్యూలైన్‌లో ఫామ్స్ పెట్టి తమ పని కానిచ్చుకుంటూ రాకెట్‌ను నిర్వహిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అందుకు ప్రధాన సాక్ష్యంగా తత్కాల్ టికెట్ కోసం లైన్‌లో నిలబడిన వారికి ఎవరికీ దొరకక పోవడమేనని తెలుస్తోంది. రెండుమూడు సార్లు స్టేషన్‌లో తత్కాల్ టికెట్ కోసం వచ్చి వెనుతిరిగిన వారు తిరిగి స్టేషన్ వైపు రారని ప్రచారం జరుగుతోంది. ఏ ఆన్‌లైన్ సెంటర్‌లోనో దళారులను సంప్రదించి రెండింతలు సొమ్ము చెల్లించి టికెట్స్ పొందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ నెలకొన్న అస్తవ్యస్తమైన నిర్వహణతో సమీపంలోని రైల్వేస్టేషన్లలో ఉన్న కౌంటర్లకు వెళ్లడమా? లేదా ఆన్‌లైన్ సెంటర్ల వద్ద దళారులను సంప్రదించడమా అన్నది రోజు రోజుకు పెరిగిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తత్కాల్ సమయంలోనైనా రద్దీకి అనుగుణంగా కౌంటర్లు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లైన్‌లో నిలబడినా టికెట్ కష్టమే



అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లడానికి తత్కాల్ టికెట్ తీసుకోవడం కోసం రైల్వే స్టేషన్‌లోని కౌంటర్‌కు వచ్చాను. తత్కాల్ సమయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిసి గంట ముందుగానే వచ్చి లైన్‌లో నిలబడి ఉన్నా. అసలు లైన్ మాత్రం ముందుకు కదలడం లేదు. సమయం అయిపోయింది. టికెట్ మాత్రం రాలేదు. ఇక్కడ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. **-సుధ, ప్రయాణికురాలు**

రెండు గంటలు ముందుగా వచ్చాం



విజయవాడ నుంచి అనంతపురం రావడానికి తత్కాల్ టికెట్ తీసుకోవడం కోసం రెండు గంటలు ముందుగా లైన్‌లో వచ్చి నిలబడినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇక్కడ జరుగుతున్న దందా ఏమిటన్నది అర్థం కానిపరిస్థితి. ఇంత రద్దీ ఉన్నప్పటికీ ఒకే కౌంటర్ నిర్వహణ ఉండడం దారుణం. అధికారులు స్పందించి ప్రయాణికుల సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది. **- రామకృష్ణ, ప్రయాణికుడు**

లైన్‌లో నిలబడి నీరసించాల్సిందే



అనంతపురం నుంచి అత్యవసర పనిమీద హైదరాబాద్ వెళ్లాల్సి ఉండడంతో తత్కాల్ టికెట్ కోసం వచ్చాం. లైన్‌లో నిలబడి నిరసించాల్సిందే తప్పా.. టికెట్ మాత్రం దొరకలేదు. ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

- జగన్నాథ్, ప్రయాణికుడు

స్పోర్ట్స్ కార్నర్

బ్యాడ్మింటన్‌లో యాడికి యువకుడికి గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్ సాధించిన విజయ్.. ట్రోఫీతో..

యాడికి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో యాడికి యువకుడు విజయ్ బంగారు పతకం సాధించాడు. మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో విజయ్ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో డిసెంబరులో జైపూర్‌లో నిర్వహించనున్న ఆల్‌ఇండియా యూనివరిటీ గేమ్స్‌కు ఎంపికయ్యాడు.

ఓపెన్ చెస్ టోర్నీ విజేత రామారావు



రామరావుకు ట్రోఫీని అందజేస్తున్న టోర్నీ నిర్వాహకులు

గుంతకల్లుటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఆదివారం స్పార్క్ చెస్ అకాడమీ, సాయిజ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా పట్టణానికి చెందిన రామారావు నిలిచాడు. ఈ పోటీల్లో పలు జిల్లాల నుంచి 120 మంది పాల్గొన్నారు. రామారావు 6/6పాయింట్లతో ట్రోఫీ, నగదు బహుమతిని అందుకున్నాడు. మూడో స్థానంలో రోటరీ పాఠశాల విద్యార్థి వంకదారు సాయిప్రనీష్ 5.50/6పాయింట్‌లతో ట్రోఫీ, నగదు పురస్కారాన్ని అందుకున్నాడు. అలాగే 9, 14, 15,18 స్థానాల్లో వేద్‌వందిత్, జునైలా నిజాం, ఉదయ్‌కిరణ్, స్నేహిత్ అనే విద్యార్థులు నిలిచారు. అండర్-7 విభాగంలో దేవేశ్వర్ 4/6పాయింట్లతో గోల్డ్‌మెడల్ సాధించాడు. అండర్-9 విభాగంలో కార్తీక్4/6గోల్డ్‌మెడల్ సాధించాడు.

సెపక్‌తక్రా జాతీయ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినితో కరస్పాండెంట్

ఉరవకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహేశ్వరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థిని తేజ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైంది. కర్నూలు జిల్లా సి బెలగల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-17 సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆ పాఠశాల నుంచి తేజ, మోసెస్ అనే విద్యార్థులు పాల్గొన్నారు. డిసెంబరు 26 నుంచి మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్‌లో జరిగే పోటీల్లో తేజ పాల్గొంటుందని కరస్పాండెంట్ సునంద, పీఈటీ ఎర్రిస్వామి సోమవారం తెలిపారు.

ఆంధ్రా జట్టులోకి ఇద్దరు జిల్లావాసులు


వినయ్‌కుమార్


గిరినాథ్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులకు చోటు దక్కింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ టీ 20, వన్డే జట్టు 2024-25 సీజన్‌కు జిల్లాకు చెందిన వినయ్‌కుమార్, గిరినాథ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 25 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే సయ్యద్‌ముస్తాక్ అలీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు తరఫున వీరు పాల్గొననున్నారు. డిసెంబరు 21 నుంచి ముంబైలో జరిగే విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందించారు.

జాతీయ హాకీ పోటీలకు కుంటిమద్ది విద్యార్థి


వినయ్‌కుమార్

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హాకీ పోటీలకు కుంటిమద్ది ఉన్నత పాఠశాలకు చెందిన జి.సాత్విక్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అనంత పద్మనాభులు, పీడీ నాగేశ్‌బాబు తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆ విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 8,9,10 తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరులో మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఈ విద్యార్థి పాల్గొంటారన్నారు.

16, 17 తేదీల్లో క్రీడా ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపిక పోటీలు ఈనెల 16, 17తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. 16న నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. 17న వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలు ప్రభుత్వ బాలుర, న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానం లో నిర్వహిస్తారన్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ 2006 జనవరి 1 తరువాత జన్మించిన క్రీడాకారులు పోటీలకు అర్హులన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, పదోతరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9441284618ను సంప్రదించాలని కోరారు.

19న జిల్లాస్థాయి యువ ఉత్సవ్


పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ, ఇతర అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఈనెల 19న జేఎన్‌టీయూలో నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా ప్రోగ్రాం అధికారి గోవర్ధన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జేసీ శివనారాయణ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న యువతీ, యువకులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువతకు సైన్సుమేళా, యంగ్ రైటర్స్ కాంటెస్ట్, యంగ్ ఆర్టిస్ట్ కాంటెస్ట్, ఫొటోగ్రఫీ, వర్క్‌షాప్, డిక్లమేషన్, జిల్లా గ్రూప్ కల్చరల్ ఫెస్టివల్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి అందజేయడంతో పాటు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌ఓ మలోల, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్ కుమార్, జయమారుతి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా రుణమేళా

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో బుధవారం మెగా బ్యాంకు రుణమేళా నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం నర్సింగరావు తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో అన్ని బ్యాంకుల అధికారులు, డీఐసీ, చేనేత, ఉద్యాన శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌డీఎం కోరారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి


జ్యోతి (ఫైల్)

గోరంట్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన మూడు నెలల గర్భిణి జ్యోతి (23) అనుమానాస్పద స్థితిలో ఆదివారం రాత్రి మృతిచెందింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు చెందిన జ్యోతి.. దీపక్ అనే వ్యక్తితో గోరంట్లలోని రాజీవ్‌కాలనీలో ఆరునెలలుగా సహజీవనం సాగిస్తోంది. మూడు నెలల గర్భిణి ఆమె ఆదివారం అస్వస్థతకు లోనుకావడంతో అద్దె ఇంటి యజమాని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి బంధువు విస్వాస్ సహకారంతో ప్రైవేటు వాహనంలో హిందూపురం ఆస్పత్రికి తరలించారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో వైద్యులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. కోల్‌కతాలోని జ్యోతి బంధువులకు పోలీసులకు సమాచారం ఇచ్చి, దర్యాప్తు చేస్తున్నారు.

పురం మున్సిపాలిటీకి తాత్కాలిక చైర్మన్


బలరామిరెడ్డి

హిందూపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపాలిటీ తాత్కాలిక చైర్మన్‌గా బలరామిరెడ్డిని నియమిస్తూ పురపాలకశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్‌పర్సన్‌గా ఉన్న ఇంద్రజ రెండు నెలల క్రితం పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి చైర్మన్ స్థానం ఖాళీగా ఉంది. కొత్త చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రాలేదు. వరుసగా మూడు నెలలు కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోతే రద్దయ్యే అవకాశం ఉంటుంది. దీంతో పురపాలకశాఖ 14వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా, మున్సిపల్ రెండో వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని తాత్కాలిక(డెలిగెట్) చైర్మన్‌గా నియమిస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త చైర్మన్ నోటిఫికేషన్ వచ్చేవరకు ఆయనే చైర్మన్‌గా కొనసాగనున్నారు.

గాలి, వెలుతురు లేకనే.. వరికి సుడిదోమ

శాస్త్రవేత్త రామసుబ్బయ్య


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

పెనుకొండ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వరిపైరుకు గాలి, వెలుతురు అందకనే సుడిదోమ ఆశిస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. మండలంలోని వెంకటగిరిపాళ్యం చెరువు ఆయకట్టులో దెబ్బతిన్న వరిపంటను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సుడిదోమ ఆశించడం వల్ల వరిపంట దెబ్బతిందన్నారు. పొలంలో ప్రతి రైతు రెండు మీటర్ల వరి నాట్లకు కాలిబాటలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బీపీటీ వరి రకానికి సుడిదోమ ఎక్కువగా ఆశిస్తుందన్నారు. ఎండుదశలో ఉన్న పంటలకు మొదలు వరకు కాలిబాట ఏర్పాటుచేసి, పినాకులస్ ట్రూపాస్, ట్రైమటోజెన్ మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చందన, రైతులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీగా వరలక్ష్మి



పుట్టపర్తిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీగా వరలక్ష్మి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో వరలక్ష్మి ఓడీసీ సీడీపీఓగా విధులు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ (ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న నాగమల్లేశ్వరి సెలవుపై వెళ్లడంతో వరలక్ష్మిని ఇన్‌చార్జ్‌గా నియమించారు.

శ్రీకృష్ణపై దాడి చేసిన మూకలపై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి బెస్త సేవా సంఘం నాయకుల వినతి


ఎస్పీకి వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న బెస్త సేవా సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని బెస్త సేవా సంఘం నాయకులు జిల్లా ఎస్పీ జగదీష్‌ను కోరారు. ఈమేరకు డీపీఓలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. అప్పుడు దాడికి పాల్పడినవారిలో ఒకరిని మాత్రమే రిమాండ్‌కు తరలించారన్నారు. మిగిలిన ఏ ఒక్కరినీ పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. వైసీపీ నాయకుల ఒత్తిడితోనే దాడికి పాల్పడిన మూకలను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించా రు. ఇప్పటికైనా శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయడంతోపాటు, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మూకలపై రౌడీ షీట్ ఓపెన్ చేసి, జిల్లా నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రబాబు, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి నాగేంద్ర, నగర ప్రధాన కార్యదర్శి చేపల హరి, నాయకులు నాగరాజు, వెంకీ ఎస్పీకి వినతి పత్రం సమర్పించారు.

ఎస్సీ వెల్ఫేర్ డీడీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కుడాలో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర శాఖ అధికారులు అనంత జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సూపరింటెండెంట్లు రవికాంత్, వెంకటలక్ష్మి, ఎన్‌జీపీసీ సూపరింటెండెంట్లు అన్వర్‌బాషా, గోవిందమ్మ, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆ శాఖ ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీడీని కలిసి వారిలో ఏఎస్‌డబ్ల్యూఓలు దామోదర్‌రెడ్డి, రాధిక, రామ్మోహన్, వార్డెన్లు రామునాయక్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వసంత, అనిత, సునీత, ప్రసన్న తదితరులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రామ్‌నగర్‌లోని నలంద డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. యాక్సిస్‌బ్యాంకు, సీఎస్‌ఆర్ అసోసి యేట్స్, జారికార్ట్ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 83175 20929ను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్..

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


కేతిరెడ్డి నరసింహారెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగిల్లు గ్రామానికి చెందిన కేతిరెడ్డి నరసింహారెడ్డి(38) సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. జమేదార్ ఇస్మాయిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసింహారెడ్డి వ్యవసాయంతోపాటు మోటారు మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. తన గ్రామానికే చెందిన రైతు రామాంజనేయులు పొలంలో విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేసేందుకెళ్లాడు. స్టార్టర్ పెట్టెలో వైర్లు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌వైరు చేతికి తగిలి, అపస్మారక స్థితిలో పడిపోయాడు. రైతు రామాంజనేయులు.. నరసింహారెడ్డి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. నరసింహారెడ్డి భార్య మౌనిక, బంధువులు పొలం వద్దకెళ్లి ప్రైవేటు వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నరసింహారెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత...


చిరుత కళేబరం

మడకశిర, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మధుగిరి ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందింది. రోడ్డు పక్కనే చిరుత కళేబరాన్ని సోమవారం గుర్తించారు. రహదారి పక్కనే చిరుత కళేబరాన్ని చూసి అటుగా వెళ్లినవారు అటవీ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) చక్రపాణి, సబ్ డీఎఫ్‌ఓ ఆనంద్, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని, చిరుత మృతికి కారణాలపై ఆరా తీశారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతిచెందినట్లు భావిస్తున్నామని డీఎఫ్‌ఓ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక మేరకు విచారణ చేపడతామన్నారు.

రైతుపై దాడిచేసిన ఎలుగుబంటి...


ఎలుగుబంటి కళేబరం

మడకశిర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం బాజయ్యపాళ్యం గ్రామానికి చెందిన రైతు నాగరాజుపై సోమవారం ఎలుగుబంటి దాడి చేసింది. ఆ ఎలుగుబంటి కూడా మరణించింది. నాగరాజు పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఎలుగుబంటి దాడి చేసి, గాయపరచింది. అక్కడే ఎలుగుబంటి కూడా మృతిచెందింది. సమాచారం అందుకున్న డీఎఫ్‌ఓ చక్రపాణి ఘటనాస్థలానికి చేరుకుని ఎలుగుబంటి కళేబరాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నివేదికలో ఎలుగుబంటి మృతికి కారణాలు తెలుస్తాయనీ, ఆ మేరకు దర్యాప్తు చేస్తామని డీఎఫ్‌ఓ వెల్లడించారు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన నాగరాజుకు చికిత్స చేయిస్తున్నామన్నారు.

న్యూస్ బాక్స్..

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌనిపల్లి, సోమరాజులకొండలో వెలసిన అక్కదేవతలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అక్కదేవతలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం, సోమవారం కావడంతో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు పెద్దనారాయణ, సుధాకర్, శరత్‌బాబు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఓబుళదేవరచెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంఈఓ రమణకు ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ మండలాధ్యక్షులు పి. రామ్‌కుమార్ మాట్లాడుతూ.. ట్యూషన్ ఫీజు బిల్లులు పెట్టమని సంబంధిత క్లర్కుకు అందించి నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు పెట్టలేదన్నారు. క్లర్కు మారినందున ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లో అన్నివిషయాలు నమోదుచేశారోలేదో ఇంతవరకు చెప్పేనాథుడే రాలేదన్నారు. ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లు ఉపాధ్యాయులకు అప్పగించాలన్నారు. ఆపార్‌లో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతుండడంతో బోధన చేయడానికి ఆటకం కలుగుతోందన్నారు.

ఏఈఓగా ప్రశాంతి

తనకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండల ఏఈఓగా ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమే విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా నల్లచెరువు సచివాలయంలో పనిచేసేవారు. ఉద్యోగోన్నతిపై తనకల్లు మండల ఏఈఓగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఏడాదిగా ఇక్కడి ఈ పోస్ట్ ఖాళీగా ఉంది.

ఎంసీ తండాలో పంట- నీరు ప్రణాళిక

తనకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెట్ల తండాలో సోమవారం జనజాగృతి ఆధ్వర్యంలో పంట-నీరు ప్రణాళికలపై రైతులకు సమావేశం నిర్వహించారు. మొగిలి చెట్లతండా, రామ్లానాయక్‌తండా, దుసాని వారిండ్లు, గ్రామాల రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈయేడాది జూన్ నుంచి అక్టోబరు వరకు సాగుచేసిన పంటల వివరాలు, అవసరమైన నీరు, వర్షపాతం, రబీలో సాగుచేసే పంటలు, అవసరమైన నీరు, తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనజాగృతి ప్రాజెక్టు మేనేజర్ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

47 మందికి ఉద్యోగాలు

కదిరి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 47 మందికి ఉద్యోగావకాశం లభించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఈ మేళాకు దాదాపు 124 మంది హాజరుకాగా, వివిధ కంపెనీల వారు 47 మందిని ఎంపిక చేశారన్నారు. ఈ మేళాలో అధ్యాపకులు హైదర్‌వలీ, నారాయణస్వామి, పీడీ నరసింహాచారి. నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తేజ్‌కుమార్‌రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

14న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నంబులపూలకుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప, ఏపీఓ చంద్రశేఖర్ తెలిపారు. 2023-24 ఉపాధి పథకంలో చేపట్టిన పనులను గ్రామస్థాయిలో తనిఖీ చేశామని, ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి.. ప్రజావేదికలు వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. ఈ సమావేశానికి ఉపాధి సిబ్బంది, కూలీలు హాజరుకావాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కదిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కదిరి, ఎన్పీకుంట రహదారి పనులను సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. 15 రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి అవుతుందని, రోడ్డు ప్రారంభించడానికి అండ్‌అండ్‌బీ శాఖమంత్రి వస్తారని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గాలివేటి క్రిష్ణమోహన్‌నాయుడు, సీఎండీ ఇస్మాయిల్, తాతా శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ అధికారులున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

కదిరి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసిందని టీటీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోముశేఖర్ తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా, జలవనరుల, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, రోడ్లు, భవనాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే హామీలు నేరవేర్చడానికి బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.

ఉపాధి పనుల్లో రూ.51 వేల అవినీతి

నల్లమాడ : మండలంలోని 14 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి పథ కం కింద చేపట్టన పనులను సామాజిక బృందం తనిఖీ చేసింది. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆ వివరాలను అధికారులు వెల్లడిం చారు. పీడీ విజయ్‌కుమార్, ఏపీడీ జ్యోతి, విజిలెన్స్ అధికారి నాగేశ్వర రావు మాట్లాడుతూ.. మండలంలోని 14 పంచాయతీల్లో మొత్తం సుమారు రూ. 13 కోట్ల పనులు చేపట్టగా.. రూ.51,755 అవినీతి జరిగిందన్నారు. కార్యక్ర మంలో ఏపీఓ సూర్యనారాయణ, రఘునాథ్ రెడ్డి, ఈసీ షేక్షావలీ, ఎస్ఆర్‌పీ ఆవులయ్య, టీఏలు పాల్గొన్నారు.

ప్రమాదాల మలుపు

◆ తరచూ రోడ్డు ప్రమాదాలు

◆ కనీసం సూచిక బోర్డునూ ఏర్పాటు చేయని అధికారులు

ధర్మవరం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరం - అనంతపురం రహదారిలో చిగిచెర్ల సమీపంలో ఓ మలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డు మలుపు వద్ద బ్రిడ్జి ఉండటంతో తరచూ రోడ్డుప్రమాదాలు సంభవిస్తున్నాయి. మలుపు ఎక్కువగా ఉండటం.. పైగా అక్కడ కంప చెట్లు అధికంగా ఉండటం పలు ప్రమాదాలకు కారణం. ఇప్పటికే పలువురు మృత్యువాతపడ్డారు. ఆ మలుపు వద్ద ఎటువంటి సూచిక బోర్డులు.. బ్రిడ్జికి రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో పలు వాహనాలు అదుపు తప్పి.. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మలుపు కనిపించేలా కంపచెట్లను తొలగించి.. సూచిక బోర్డులు.. బ్రిడ్జికి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



చిగిచెర్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కాలువకుంట భూమిని కాపాడండి

ఆర్డీఓ, తహసీల్దార్‌కు తిప్పేపల్లి రైతుల వినతి

ధర్మవరంరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పేపల్లి గ్రామంలో రావులచెరువు, ధర్మవరం చెరువుల కింద నీరు పారే కాలువకుంట భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని తిప్పేపల్లి గ్రామరైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం ఈ మేరకు వారు ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబుకు మీ కోసంలో ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 66-1లో 18ఎకరాలలో కుంట ఉందని, ఈ కుంట నిండితే వందలాది ఎకరాల ఆయకట్టు భూముల్లో పంటలు పండించుకోవచ్చని అన్నారు. అయితే కాలువ కుంట భూమిని రావులచెరువు గ్రామానికి చెందిన రాధామ్మ భర్త పెద్దన్నతో పాటు మరికొంతమంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని తమదే భూమి అంటూ జేసీబీతో కుంటను చదును చేస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది అధికారులు కాసులకు కక్కుర్తి పడి అప్పట్లోనే పట్టాలు పుట్టించారని విమర్శించారు. రెవెన్యూ అధికారులు స్పందించి కాలువ కుంట భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ రైతులు ఆర్డీఓ, తహసీల్దార్ ఎదుట వాపోయారు. వీటిపై స్పందించిన అధికారులు ప్రభుత్వభూములు, చెరువు కుంట భూములను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో రైతులు డీలర్ వెంకటరాముడు, చిన్న వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రమణరెడ్డి, రాజారెడ్డి, పెద్దవెంకటప్ప, కుళ్లాయప్ప పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద తిప్పేపల్లి రైతులు

కార్తీక సోమవార పూజలు



ధర్మవరం : ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు, త్రిలింగేశ్వరుడు (ఇన్‌సెట్లో)





కదిరి : శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు, అలంకరణలో శివుడు



నల్లచెరువు: అలంకరణలో మూలవిరాట్

ధర్మవరంరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సోమవారం సందర్భంగా స్థానిక బసవన్నకట్ట వీధిలోని త్రిలింగేశ్వరుడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాఘవశర్మ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయం ముందు దీపాలు వెలిగించారు.

● కదిరి : కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా స్థానిక శివాలయానికి తెల్లవారుజామున నుంచే భక్తులు క్యూ కట్టారు. ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం భక్తులతో కిటకిటాడింది.

● నల్లచెరువు : మండలంలోని కె.పూలకుంట రోడ్డులో ఉన్న భక్త మార్కెండేయ శివాల యంలో కార్తీక మాసం సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకుడు సురేష్‌బాబు మాట్లాడుతూ శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణ, లక్షదీపోత్సవం నిర్వహిస్తామన్నారు.



మామిళ్లకుంట కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం నాయకులను అడ్డుకున్న పోలీసులు

పుట్టపర్తిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : హిందూపురంలో పేదల గుడిసెలను పోలీసులు శనివారం తొలగించిన నేపథ్యంలో కలెక్టరేట్ ముట్టడికి వస్తున్న సీపీఎం నాయకులను మామిళ్లకుంట కూడలిలోనే పోలీసులు సోమవారం అడ్డుకున్నారు. కలెక్టరేట్ ముట్టడికి అనుమతి లేదని డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు అన్నారు. దీంతో సీపీఎం నాయకులు రోడ్డుపై బైఠాయించారు. సమస్యను కలెక్టర్‌కు తెలియచేయడానికి 20 మందికి పోలీసులు అనుమతి ఇచ్చారు. ఇందులో సీపీఎం నాయకులు ఈఎస్ వెంకటేసు, శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, పెద్దన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, వెంకటేసులు, బాబాజాన్ పాల్గొన్నారు.

కూల్చడం అన్యాయం

హిందూపురంలో పోలీసులు పేదల గుడిసెలు కూల్చడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎలాంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా గుడిసెలు పోలీసులు కూల్చివేయడం దుర్మార్గమన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన పలువురు వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరానికి చెందిన కౌన్సిలర్లు రమణమ్మ, సరితాల ఆవాబీ, తొండమాల ఉమాదేవి, మాజీ కౌన్సిలర్లు రమాదేవి, డిష్ రాజు, వైసీపీ నాయకులు తోపుదుర్తి వెంకటరాముడు, సరితాల బాషా, తొండమాల రవి, తొండలమాల నాగార్జున, సోమశేఖర్ పార్టీలో చేరారు.



పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

కేన్సర్ నివారణపై అవగాహన కల్పించండి

పుట్టపర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేన్సర్ నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉచిత కేన్సర్ పరీక్షలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి ఎన్‌సీడీ 3.0 కార్యక్రమం మొదలవుతుందని, తద్వారా షుగర్, బీపీ, పలు రకాల కేన్సర్లకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. డీఎంహెచ్ఓ మంజువాణి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆర్‌జీఎస్‌కేలోని చైల్డ్‌స్క్రీనింగ్ హెల్త్ కార్డులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ పాల్గొన్నారు.

మౌలానాకు ఘన నివాళి

పుట్టపర్తి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి వేడుకలను (మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం) ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎస్పీ వీ రత్న అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఓ సుజాత, సూపరిండెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్ ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

● సాయిఆరామంలో...

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని స్థానిక సాయిఆరామంలో మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు, మైనారిటీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం : స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన ఇండియాకు చేసిన సేవలను వైస్ ప్రిన్సిపల్ త్రివేణి వివరించారు. అలాగే స్థానిక లోనికోట ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్‌లో ముస్లీం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి వేడుకలను నిర్వహించారు.

● గాండ్లపెంట : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అబుల్ కలాం జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు క్రిష్ణానాయక్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు విశ్వనాథ్‌రెడ్డి, గంగాధర్, ముంతాజ్‌అలీ, చిన్నప్ప, పాపారాయుడు, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



మౌలానా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ వీ రత్న



సాయి ఆరామంలో నివాళులర్పిస్తున్న సభ్యులు

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆస్పత్రిలో చేర్పించిన డీఎస్పీ



గాయపడ్డ చిన్నారి వద్ద డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో గాయపడ్డ తండ్రి కొడుకులను హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించి.. మానవత్వం చాటుకున్నాడు. అనంతపురానికి చెందిన దేవేంద్ర, అతని కుమారుడు శరత్ సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా.. కొత్తచెరువు- గోరంట్ల మార్గంలో గంటల మారెమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి శరత్ తీవ్రంగా, దేవేంద్ర స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో పుట్టపర్తికి వస్తున్న హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో ఆ తండ్రీ కొడుకులను తీసుకెళ్లి.. సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారిద్దరిని అనంతపురానికి తరలించారు. పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మద్యం, నాటుసారా విక్రేతల అరెస్టు

తాడిమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్లకొండయ్యపల్లి, బత్తలపల్లి మండలం రామాపురం క్రాస్ వద్ద ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, చాంద్‌బాషా తెలిపారు. చిల్లకొండయ్యపల్లిలో ఒకరిని అరెస్టు చేసి అతనినుంచి 20 ఆంధ్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నా మన్నారు. అలాగే రామాపురం క్రాస్ నాటుసారా అమ్ముతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు.

● అక్రమ మద్యం స్వాధీనం

కదిరి అర్బన్ : మండలంలోని వరిగిరెడ్డిపల్లి వద్ద 48 మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఓ మహిళను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గుండెపోటుతో యువకుడి మృతి

హైదరాబాద్ (హైదర్‌నగర్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుడిలో ప్రదక్షిణలు చేస్తున్న ఓ యువకుడు ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందాడు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన కనంపల్లి విష్ణువర్ధన్ (31) కేపీహెచ్‌బీ కాలనీ రోడ్‌నెంబర్-1లోని అమ్మ హాస్టల్‌లో ఉంటూ మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 7 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-3లోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లాడు. ప్రదక్షిణలు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. సహచర భక్తులు ప్రథమ చికిత్స చేసి సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

కదిరి అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని జనసేన నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బైరవప్రసాద్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా సర్వ నాశనం చేసిందన్నారు. రాష్ట్రంలో అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. సోషియల్ మీడియలో మహిళలపై అసభ్యకర పోస్టర్లు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవడం తప్పా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో చిన్నప్పరెడ్డి, లక్ష్మన్, రవికుమార్, గంగరాజు, రాజేంద్రప్రసాద్, రమణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

పుట్టపర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ముస్లీం మైనార్టీల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని ముస్లీం మైనార్టీ నాయకులు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మహమ్మద్ రఫీ, షామీర్, కాశీం కుళ్లాయప్ప, దాదా ఖలందర్, సయ్యద్, ఫక్రుద్దీన్ తదితరులు కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటికకు స్థలంలేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయాలని, షాదీమహల్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి మరో రూ.55 లక్షలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.

● నల్లమాడ : మండల కేంద్రంలో శ్మశానవాటికకు స్థలం లేకపోవడంతో... మృతదేహాలను వంకలు, వాగుల్లో పూడ్చడం జరుగుతోందని, శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని రాయసీమకమ్యూనిస్టు పార్టీ నాయకులు తహసీల్దార్ రంగనాయకులకు సోమవారం వినతిపత్రం అందించారు. అలాగే డంపింగ్ యార్డు ఇళ్లకు దగ్గరగా ఉండడం వలన దుర్వాసన వస్తోందని, ఈ యార్డులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, ఆ యార్డును ఊరికి దూరంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపీ చంద్ర, అశోక్, చందు, వెంకటయ్య ఉన్నారు.

రోడ్డు పనుల అడ్డగింత

కదిరి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్లు వద్ద కదిరి, గోరంట్ల రహదారి విస్తరణ పనులను కందికుంట కాలనీ వాసులు సోమవారం అడ్డుకున్నారు. రోడ్డు విస్తర్ణలో భాగంగా ఆ కాలనీ వద్ద రోడ్డును తగ్గుగా వేయడంతో కాలనీ నుంచి రావడానికి కష్టం అవుతుందని వారు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ పోలప్ప సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు పనులకు సంబంధించిన ఇంజనీర్‌తో మాట్లాడారు. కాలనీకి తప్పకుండా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో కాలనీవాసులు వెనుదిరగడంతో పనులు కొనసాగాయి.

అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం

నంబులపూలకుంట, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పశువుల మందలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని గడువులోపు తొలగించకపోతే తాము తొలగిస్తామని ఎంపీడీఓ అంజనప్ప హెచ్చరించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ సోమవారం స్థానిక నాయకులు ఎంపీడీఓకి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టడం తగదని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేసి, గడువులోపు తొలగించకపోతే, తామే తొలగిస్తామని హెచ్చరించారు.

టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి

ధర్మవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముస్లీం మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మౌలాన అబ్దుల్ ముస్తక్ అహమ్మద్‌ను నియమించారన్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఆఫ్ అడ్వైజర్‌గా క్యాబినెట్ ర్యాంక్ హోదాతో మహమ్మద్‌షరీఫ్‌ను నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అత్తర్ రహీంబాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాళ్లపల్లి షరీఫ్, నాయకులు సమీర్, సలీం, రావులచెరువు కుళ్లాయప్ప, ఆజాద్ పాల్గొన్నారు.

పీవీఎస్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

ముదిగుబ్బ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీఎస్ పాఠశాలలోసాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పాఠశాల చైర్మన్ పీవీఎస్ నాయుడు తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జ్ మనీషా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'పురం' డీఎస్పీ

గాయపడ్డ తండ్రీకొడుకులు ఆసుపత్రికి ..



గాయపడ్డ చిన్నారి వద్ద డీఎస్పీ మహేష్

పుట్టపర్తిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తండ్రీకొడుకులను హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించి.. మానవత్వం చాటుకున్నారు. అనంతపురానికి చెందిన దేవేంద్ర, అతడి కుమారుడు శరత్ సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా.. కొత్తచెరువు- గోరంట్ల మార్గంలో గంటల మారెమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి శరత్ తీవ్రంగా, దేవేంద్ర స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో పుట్టపర్తికి వస్తున్న హిందూపురం డీఎస్పీ మహేష్ తన వాహనంలో ఆ తండ్రీకొడుకులను తీసుకెళ్లి.. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుపులయ్య పాళ్యం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిష్కరించారని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బోరు వేయించడంతో పుష్కలంగా నీరు లభించాయని, గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమయిందని మాజీ సర్పంచు శ్రీనాథ్, నాయకులు జయరామప్ప, వెంకటేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘంలో ఇద్దరికి చోటు

మడకశిర రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘంలో మడకశిర మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు దక్కింది. రాష్ట్ర స్థాయి భాషోపాధ్యాయ కమిటీ ఎన్నికలు రాజమండ్రిలో నిర్వహించారు. అందులో మడకశిర మండలం గౌడనహళ్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నరసింహమూర్తి ఉపాధ్యక్షుడిగా, జిల్లేడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న కరియన్నకు న్యాయసలహాదారుడిగా ఎన్నుకున్నారు. వీరిని ఉపాధ్యాయులు ఆదిశేషయ్య, కొండయ్య, శివానంద రెడ్డి, వేణుగోపాల్ అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

మడకశిరటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ విశ్వనాథ్ తెలిపారు. కల్లుమర్రి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మాత్రమే విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

రూ.1.75 లక్షల నగదు అపహరణ

గోరంట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంక్ వద్ద దుండగుడు నగదు అపహరించుకుపోయాడు. అశ్వర్థప్ప అనే వ్యక్తి వద్ద ఉన్న రూ.1.75 లక్షల నగదు కవర్‌ను లాక్కొని వెళ్లాడు. చిలమత్తూరు మండలం భూమయ్యగారిపల్లికి చెందిన అశ్వర్థప్ప గోరంట్లలోని ఓ ప్రైవేటు బ్యాంకులో బంగారం నగలు తాకట్టు పెట్టాడు. వాటిని విడిపించుకోవడానికి నగదు రాగా, ముఖద్వారం వద్దనే నగదు విషయాన్ని గుర్తించిన వ్యక్తి కవర్ లాక్కుని పరారైనట్లు బాధితుడు తెలిపారు. చోరీపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

డీఈకి ఎంఈ బాధ్యతలు

హిందూపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హిందూపురం మునిసిపాలిటీలో పనిచేస్తున్న డీఈ బాలసుబ్రహ్మణ్యంకు ఎంఈ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఈకి అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

సోమందేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల ఆహార పదార్థాల్లో లోపాలు ఉంటే చర్యలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ పేర్కొన్నారు. సోమవారం సోమందేపల్లి మండల కేంద్రంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు, బేకరీల్లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సర్కిల్‌లోని నందిని హోటల్, ఇతర హోటళ్లలో ఫ్రిడ్జ్‌లో ఉంచిన ఆహార పదార్థాలను ఆమె పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాచిపోయిన ఆహారాలను ప్రజలకు వడ్డిస్తున్న పలువురు యజమానులకు నోటీసులు జారీచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చాలా మంది కాలం చెల్లిన ఆహార పదార్థాలను ప్రజలకు అంటగడుతూ వారి ఆరోగ్యాలతో చలగాటం ఆడుతున్నారని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా పలువురు రెస్టారెంట్లు, హోటళ్లు నడుపుతున్నారని అన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం

చిలమత్తూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులకు టీడీపీ నాయకుడు ఫరీద్‌బాబా నేతృత్వంలో అన్నదానం చేపట్టారు. మడకశిర, అమరాపురం మండలాల నుంచి కాలినడకన పాదయాత్రతో తిరుమలకు వెళుతున్న 200 మంది భక్తులకు కొడికొండకు చెందిన ఫరీద్ బాబా కుటుంబ సభ్యులతో పాటు ఆయన మిత్రులు కలిసి సోమవారం రాత్రి అన్నదానం చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయానికి భక్తులను సాదరంగా స్వాగతం పలికి అక్కడ వారికి భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా ఫరీద్ బాబా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దైవకార్యక్రమానికి కాలినడకన వెళుతున్న భక్తులకు గత పదేళ్లుగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అరహాన్, పరహాన్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు స్కూటర్ల పంపిణీ



త్రిచక్ర వాహనాలకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శిశు సంక్షేమ శాఖ వికలాంగుల కోటా నుంచి 20 మంది వికలాంగులకు విద్యుత్ చాలిత త్రిచక్ర వాహనాలను ఎమ్మెల్యే వెంకటేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సోమవారం తాలూకా పంచాయతీ కార్యాలయంలో ఈఓ జానకిరామ్, తహసీల్దార్ వరదరాజు, శిశు సంక్షేమ అధికారి సునీత, త్రిచక్ర వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అర్హులైన వికలాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి త్రిచక్ర వాహనాలు మంజూరు చేస్తామని తెలిపారు.

కనిపించని హెచ్చరిక బోర్డులు

● సూచికలను కప్పేసిన చెట్లు ● జాతీయ రహదారిపై నిర్లక్ష్యం ● తరచూ ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు





కోడూరుతోపు వద్ద సూచిక బోర్డులను కప్పేస్తున్న చెట్లు, కంబాలపల్లిలో డివైడర్లపై చెట్ల మధ్యలో సూచికబోర్డు

హిందూపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయదారిలో కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన సూచిక బోర్డులకు చెట్లు కమ్ముకున్నాయి. దీంతో జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులకు మలుపులు, స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేకపోతున్నారు. ముఖ్యంగా చిలమత్తూరు మండలం కోడూరు తోపువద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో సైతం జాతీయ రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన సూచిక బోర్డులకు చెట్ల కొమ్మలు అలుముకున్నాయి. దగ్గరకు వెళ్లే దాకా మలుపు ఉందని గుర్తించలేకపోతున్నారు. కంబాలపల్లి దాటాక సూచిక బోర్డు డివైడర్ల మధ్యలో చెట్ల మధ్యన మూసుకుపోయాయి. ఇతర ప్రాంతాలవారు వాటిని గుర్తించలేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి అధికారులు స్పందించి వెంటనే సూచిక బోర్డుల వద్ద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాల్సిన అవసరం ఉంది.

మూడు నెలల్లో రైల్వేస్టేషన్ రోడ్డు పనులు: ఎంపీ



రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలిస్తున్న బీకే పార్థసారథి తదితరులు

పెనుకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మూడు నెలల్లో రైల్వే స్టేషన్ రోడ్డు పనులు చేపడతామని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. సోమవారం అధికారులు, నాయకులతో కలిసి గోతులుపడ్డ రైల్వే స్టేషన్ రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా ఏళ్లుగా మరమ్మతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎంపీ నిధులతో మూడు నెలల్లో నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఎన్నోఏళ్లుగా రైల్వే స్టేషన్ రోడ్డు మరమ్మతులు లేక డ్రైనేజీ, వీధి దీపాలు లేక చాలా అధ్వాన్నంగా మారిందన్నారు. ప్రయాణికులు స్టేషన్‌కు వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కియా కార్లపరిశ్రమ వచ్చాక పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రైల్వే స్టేషన్ రోడ్డు కొత్తగా వేయడంతోపాటు డ్రైనేజీలు నిర్మించి రోడ్లకు ఇరువైపులా వీధి దీపాలు ఏర్పాటు చేయడం అవసరమన్నారు. ఈ విషయమై ప్రజలు కూడా అనేకమార్లు వినతి పత్రాలు అందించారని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు శ్రీనివాసులు, బాబులురెడ్డి, అనిల్‌కుమార్, కన్నాస్వామి, శీన పాల్గొన్నారు.

వైభవంగా శనైశ్చర స్వామి కల్యాణోత్సవం







ముస్తాబైన శనైశ్వరస్వామి మూలవిరాట్, కల్యాణోత్సంలో జేష్టాదేవి సమేత శనైశ్వరస్వామి, రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హిందూపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఉన్న జేష్టాదేవి, శనీశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెలవారుజాము నుంచి ఆలయంలో మూలవిరాట్‌కు వివిధ అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణవేడుకలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంలో అధిరోహించి ఊరేగించారు. మేలతాళాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మూలవిరాట్‌ను పూలు నగలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ముగిసిన ఉత్సవాలు





బొమ్మలింగేశ్వరస్వామి ఊరేగింపు, అలంకరణలో అక్కమ్మగార్లు

అగళి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొక్కలపల్లి వద్ద ఏడుగురు అక్కమ్మ దేవతలు, ఏలుమందమ్మ బొమ్మలింగేశ్వరస్వామికి మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. బొమ్మలింగేశ్వరస్వామి ఏలు మందమ్మ దేవతలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. హోమాలతోపాటు ప్రాణప్రతిష్ఠ, కళశ స్థాపన కార్యక్రమాలు చేశారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. 800 సంవత్సరాల పురాతన ఆలయాల్లో దేవతలకు ప్రాణప్రతిష్ఠ చేపట్టడం ఆనందంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నేటి విద్యార్థిలోకం ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఉద్యోగ ఉపాధి రంగాల్లో రాణించినప్పుడే సమాజం హర్షిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, ఎన్ఎస్ఎస్ పీఓ కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో అబుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, సుశీలబాయి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని ఎస్‌పీఎస్ జూనియర్, ఏఎన్‌కే డిగ్రీ కళాశాల, ఎస్కేడీ జూనియర్, ఎస్‌పీవీఎన్ డిగ్రీ కళాశాలల్లో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అబుల్‌కలాం విద్యా రంగానికి ఎనలేని సేవలందించి, ప్రగతి పథంలో నిలిపారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాళ్లు సూర్యనారాయణ, విజయలక్ష్మీ, భక్తవత్సలం, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో గోరంట్ల బాలిక ప్రతిభ

మరో ఇద్దరు రాష్ట్ర స్థాయికి ఎంపిక





భవిష్యలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు పల్లవి, కల్యాణి

గోరంట్ల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో అండర్ 17 విభాగం బాల్ బ్యాడ్మింట్ క్రీడలో గోరంట్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని భవిష్యలక్ష్మి విజయం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయులు మాధవీలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోరంట్లలోని ఆర్టీసీ కండెక్టర్ ప్రాణేష్, పద్మావతి కుమార్తె భవిష్యలక్ష్మి పదో తరగతి చదువుతోంది. ఆమె బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరుస్తూ మండల, జిల్లా స్థాయిలో విజేతగా నిలిచింది. ఈనెల 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లాలోని పెద్దవేగిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆమె ద్వితీయ స్థానంలో నిలిచి కప్పు, ప్రసంశాపత్రం అందుకున్నారు. ఆమెను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ అండర్ 14 విభాగంలో 8వతరగతి విద్యార్థిని పల్లవి, అండర్ 17లో కల్యాణిలు జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీ సూర్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనతో ఆకలి తీర్చిన బాలకృష్ణన్



బాలకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అప్పటి కార్మికులు

హిందూపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేలాది మంది నిరుపేదలకు ఉపాధి కల్పించి ఆకలి తీర్చిన దేవుడు ఎల్‌జీ బాలకృష్ణన్ అని సూపర్ స్పిన్నింగ్ మిల్లు రిటైర్డ్ కార్మికులు కొనియాడారు. సూపర్ స్పినింగ్ మిల్లు కార్మికుల అపూర్వ కలయిక సోమవారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి కూడా పూర్వపు కార్మికులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు తాండవిస్తున్న అనంతపురం జిల్లాలో కొయంబత్తూరుకు చెందిన ఎల్‌జీ బాలకృష్ణ 1963లో కిరికెర వద్ద సూపర్ స్పినింగ్‌మిల్లు నిర్మించారని అన్నారు. తరువాత కొట్నూరు వద్ద బి మిల్లు, గొల్లపల్లి వద్ద ప్రీకాట్, ప్రాసెసింగ్ యూనిట్, సూపర్‌సారా, కలర్ ప్రాసెస్, తూమకుంట వద్ద ఎల్‌జీ టైర్ల ఫ్యాక్టరీ, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఎల్ఆర్‌జీ విద్యాలయం నిర్మించి కార్మికుల పాలిట దేవుడయ్యారని కొనియాడారు. ఆయన చొరవతో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. రిటైర్డ్ అయ్యాక చాలా మంది పిల్లలతో ఉండాలని కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాలకు వెళ్లారని, వారందరూ ఇక్కడ కలవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎల్‌జీ బాలకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సభ్యత్వంలో అగ్రగామిగా నిలుపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సభ్యత్వ నమోదు చేసుకొన్న ప్రతి కార్యకర్తకు పార్టీ భరోసా కల్పిస్తుందని, ఆ విషయాలను గ్రామంలో పార్టీ కార్యకర్తలందరికీ తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదుకు సంబంధించి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండలాల కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులను అడ్డుకున్న పోలీసులు



మామిళ్లకుంట కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తిరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో పేదల గుడిసెలను శనివారం పోలీసులు తొలగించిన నేపథ్యంలో.. సోమవారం కలెక్టరేట్ ముట్టడికి వస్తున్న సీపీఎం నాయకులను మామిళ్లకుంట కూడలిలోనే పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టరేట్ ముట్టడికి అనుమతి లేదని డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు అన్నారు. దీంతో సీపీఎం నాయకులు రోడ్డుపై బైఠాయించారు. సమస్యను కలెక్టర్‌కు తెలియచేయడానికి 20 మందికి పోలీసులు అనుమతి ఇచ్చారు. ఇందులో సీపీఎం నాయకులు ఈఎస్ వెంకటేసు, శ్రీనివాసులు, ప్రవీణ్, పెద్దన్న, రమణ, వెంకటేసులు, బాబాజాన్ పాల్గొన్నారు.

కూల్చడం అన్యాయం

హిందూపురంలో పోలీసులు పేదల గుడిసెలు కూల్చడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎలాంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా గుడిసెలు పోలీసులు కూల్చివేయడం దుర్మార్గమన్నారు.

ఉర్దూ విద్యార్థినికి ప్రతిభా అవార్డు



అవార్డు అందుకుంటున్న నూరేకొనైన్

పరిగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల విద్యార్థిని నూరేకొనైన్ గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ చూపి ఉత్తమ విద్యార్థినిగా ఎంపికయింది. సోమవారం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సత్యసాయి జిల్లా కేంద్రంలో కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా విద్యార్థినిని సన్మానించి ఉత్తమ ప్రతిభా అవార్డును అందించారు. విద్యార్థినిని ఎంఈఓ లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయుడు బాబాఫకృద్దీన్ అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజశేఖర్ సిబ్బంది రొద్దం మండలం బండ్లపల్లిలో దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అరెస్టు చేసి 95 ఓసీ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బండ్లపల్లికి చెందిన మంజు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి అతన్ని సోమవారం అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఘనంగా ఒనకే ఓబవ్వ జయంతి

పావగడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోటేనాడుగా పేరుగాంచిన చిత్రదుర్గాన్ని ఆక్రమించుకోవడానికి వచ్చిన ఆంగ్లేయులను చంపి వీరవనితగా పేరుగాంచిన ఒనకే ఓబవ్వ జయంతిని పట్టణంలోని బీఎంహెచ్‌సీఎస్ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌నాయక్ మాట్లాడుతూ వీరవనిత వణికే ఓబవ్వ నేటి మహిళలకు స్ఫూర్తిదాయకం అని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు ఓబవ్వ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చౌకధాన్యపు డిపోల తనిఖీ

గుడిబండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు, గుడ్డదహళ్లి గ్రామాల్లోని చౌకధాన్యపు డిపోలను సోమవారం విజిలెన్స్ అధికారి జమాల్‌బాషా సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. రెండు గ్రామాల్లోని ఎఫ్‌పీ షాపుల్లో ఈపోస్ మిషన్‌లో నిత్యావసర సరుకులు వ్యత్యాసం ఉన్నాయని తమ తనిఖీలో వెల్లడైనట్లు తెలిపారు. అదేవిధంగా లబ్ధిదారుల వద్ద చక్కెర, కందిబేడలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే అదనంగా వసూలు చేశారని ఫిర్యాదులు వచ్చాయన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించండి

పెనుకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో డ్రైనేజీని ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాలను ఇంటి యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఆయనతోపాటు ఇంజనీర్ పవన్‌కుమార్, సిబ్బంది దర్గా సర్కిల్ నుంచి షేర్‌ఖాన్ మసీదు వరకు ఉన్న డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

చేనేత కుటుంబాలకు పరామర్శ



చేనేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

సోమందేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న డీకే నారాయణస్వామి కుటుంబాన్ని, ఇటీవల మదనపల్లి నీరుగట్టువారిపల్లిలో మగ్గానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న చింతా హరి కుటుంబాన్ని సోమవారం చేనేత సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నారాయణస్వామి ఆరోగ్యాన్ని బాగా చూసుకోవాలని అవసరమైతే సంఘం ఆసరాగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చింతా హరి కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీసీ హరి, రమేష్, శివప్రసాద్, రంగన గోపాల్, అమర్‌నాథ్, దాసరి శ్రీనాథ్, పామిశెట్టి ఈశ్వర్, జగదీశ్, మనోహర్, సుధాకర్ పాల్గొన్నారు.